క్లుప్తంగా

పాఠశాలను తరలించొద్దు



హెచ్‌ఎం రేవతికి వినతి పత్రమిస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను తరలించవద్దని కోరుతూ పలువురు గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు మంగళవారం హెచ్‌ఎం రేవతికి వినతి పత్రం అందించారు. ఈ పాఠశాలను తరలించి ఇక్కడ గురుకుల పాఠశాల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజేశం, విష్ణు, రాజేందర్, రమణాచారి, విజయ్‌మోహన్, సంతోషి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకునే పొదుపు



నరోత్తంరెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): పొదుపుచేసిన డబ్బు ఆపదకాలంలో ఆదుకుంటుందని పురుషుల పొదుపు సంఘం గ్రామ వ్యవస్థాపకుడు నరోత్తంరెడ్డి అన్నారు. అంక్షాపూర్ పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. సంఘం చేసిన కృషిని వివరించి, లావాదేవీలపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడిగా పనిచేసిన వారిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అనంత రాజయ్య, నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రాములు, సూరయ్య, సునందారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలకు 'జుబేర్‌పాష' వితరణ



విరాళం అందజేస్తున్న జుబేర్‌పాష

ములుగు(గజ్వేల్): మండలంలోని వాగునూతి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హిందూ ఆలయాల నిర్మాణాలకు బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి, ఏటుజెడ్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ జుబేర్‌పాష రూ.50 వేలు విరాళం అందజేశారు. మైనార్టీ వర్గానికి చెందిన ఆయన హనుమాన్, రామాలయాల నిర్మాణానికి మంగళవారం తన వంతుగా ఆ మొత్తాన్ని అందజేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బోరుబావులు ఏర్పాటు



మహ్మదాపూర్‌లో బోరు వేయిస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: పల్లె ప్రజల గొంతు తడిపేందుకు బోరు బావులు ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మహ్మదాపూర్, పందిల్ల, పోతారం(ఎస్) గ్రామాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మంజూరు చేసిన నిధులతో బోర్లు వేయించామన్నారు. మహ్మదాపూర్ ముదిరాజ్‌లు పెద్దమ్మ దేవాలయం వద్ద, పోతారం(ఎస్)లో యాదవ సంఘ భవనం వద్ద, పందిల్లలో ముదిరాజ్ కమ్యూనిటీ భవనం వద్ద బోర్లు వేసినట్లు చెప్పారు. నాయకులు రాంగోపాల్‌రెడ్డి, సంపత్‌నాయక్, శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెట్‌పల్లి మధిర సలెంద్రి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొత్త యాదగిరి రెండు ఎద్లు పొలం వద్ద మేపుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం పడగా ఎద్దు చెట్టు కిందకు వచ్చింది. అదే సమయంలో పిడుగుపడి ఎద్దు మృతి చెందింది. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

జోరుగా వేసవి శిక్షణ శిబిరాలు
- ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీలో తర్ఫీదు
- ఆసక్తి చూపుతున్న క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు సెల్‌ఫోన్‌లకే పరిమితవుతున్నారు. ఈ తరుణంలో చాలా మందికి మైదానం అంటే తెలియకుండా పోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులకు క్రీడలపై మక్కువ తగ్గిపోతుంది. దీంతో ఆటలైనా.. పాటలైనా సెల్‌ఫోన్‌లపైనే ఆధారపడుతున్నారు. క్రికెట్, కబడ్డీ క్రీడలను కేవలం టీవీల్లో చూసి ఆనందించడానికే పరిమితమవుతున్నారు. వారిని క్రీడలవైపు ఆసక్తి చూపించేలా వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి.

ముమ్మరంగా శిక్షణ శిబిరాలు

ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు బంధువుల ఇళ్లు, పర్యాటక ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో క్రీడలపై ఆసక్తిని కలిగించేందుకు ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయగా, క్రీడా అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సైతం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డీఎస్‌ఏ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) ఆధ్వర్యంలో అర్బన్ విభాగంలో పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణలోను, రూరల్ విభాగంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోను క్రీడాకారులకు ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ ఇస్తున్నారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కబడ్డీ శిక్షణ

కబడ్డీలో కూడా..

అదే విధంగా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో క్రీడాకారులకు కబడ్డీలో శిక్షణ ఇస్తుండగా, గజ్వేల్ మండల్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీస్టేడియం ఆవరణలో వాలీబాల్‌పై తర్ఫీదునిస్తున్నారు.

క్రీడాస్ఫూర్తి కోసం

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని తీసుకువచ్చేందుకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక మినీ స్టేడియంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఫుట్‌బాల్, వాలీబాల్‌పై శిక్షణ ఇస్తుండగా, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉదయం ఫుట్‌బాల్, సాయంత్రం కబడ్డీలో తర్ఫీదునిస్తున్నారు. ఫుట్‌బాల్ శిక్షణలో ప్రతినిత్యం సుమారు 40 మంది వరకు పాల్గొంటుండగా వాలీబాల్‌లో 30 మంది, కబడ్డీలో 15 మంది క్రీడాకారులు పాల్గొంటూ తమలోని ఆట తీరుకు పదునుపెట్టుకుంటున్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



విద్యార్థుల్లో క్రీడల ద్వారానే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుంది. మొదటి సారిగా అర్బన్ ప్రాంత క్రీడాకారుల కోసం డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. నెల రోజుల పాటు జరిగే ఈ వేసవి శిక్షణలో ఫుట్‌బాల్‌లో మెళకువలు నేర్పించడంతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దుతున్నాం.

– నాగేశ్, ఫుట్‌బాల్ కోచ్ (వ్యాయామ ఉపాధ్యాయుడు)

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



వాలీబాల్ శిక్షణలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రతియేటా వేసవిలో ఈ శిక్షణ కొనసాగుతుంది. ఇప్పటి వరకు నలుగురు క్రీడాకారులు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా గజ్వేల్ మండల్ వాలీబాల్ క్లబ్ ద్వారా ముందుకు సాగుతున్నాం. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను శిక్షణ శిబిరాలకు పంపించి క్రీడలపై పట్ల మక్కువ కలిగేలా చొరవ చూపాలి.

– సంతోష్‌కుమార్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, కానిస్టేబుల్

ఆసక్తిగా నేర్చుకుంటూ..

సిద్దిపేటకమాన్: అంబిటస్, సాక్షి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. 100 మందికిపైగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పలు అంశాలను శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. 5న ప్రారంభమైన ఈ ఉచిత శిక్షణ శిబిరం ఈ నెల 17 వరకు కొనసాగనుంది. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7గంటల వరకు మాస్టర్ భాగ్యరాజ్ కరాటే క్లాసులు, ఉదయం 8.30 నుంచి 10.30 వరకు టీచర్లు అపర్ణ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సాయిప్రియ స్పోకెన్ ఇంగ్లిష్, శ్రీజ హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. చేతిరాత, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. శిబిరం నిర్వహణను పాఠశాల డైరెక్టర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.



చిన్నారులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయులు సాయిప్రియ, అపర్ణ, శ్రీజ

స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాం



వేసవి సెలవుల్లో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించడం వల్ల పలు నూతన విషయాలను నేర్చుకుంటున్నాం. అంబిటస్ పాఠశాలలో ఆరో తరగతి పూర్తి చేసి వచ్చే అకాడమిక్ ఇయర్‌లో ఏడో తరగతిలోకి వెళ్లనున్నాం. టీచర్ సాయిప్రియ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు.సాక్షి, రెడ్డి సార్‌కు ధన్యవాదాలు.

– సంహిత్, కార్తికేయ, విద్యార్థులు

20 మందికి చేతిరాతలో శిక్షణ



విద్యార్థులు శిక్షణ శిబిరంలో చాలా ఆసక్తిగా అన్ని విషయాలు నేర్చుకుంటున్నారు. 20 మందికి చేతిరాతపై మెళకువలు నేర్పిస్తున్నాను. నూతన విషయాలు నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో చాలా ఉపయోగపడతాయి.

– బి.శ్రీజ, హ్యాండ్ రైటింగ్ టీచర్

సెల్‌ఫోన్ వీడితేనే ఉజ్వల భవిష్యత్: ఏసీపీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటజోన్: ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు ప్రమాదకరంగా మారుతున్నాయని, వాటిని వీడితేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏసీపీ మధు అన్నారు. స్థానిక గార్డెన్స్‌లో వ్యాసమహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బాల సంస్కార్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలతో సన్నిహితంగా ఉండాలన్నారు. మున్సిపల్ చైర్మన్ మంజుల మాట్లాడుతూ పిల్లలకు ఇష్టమైన ఆటలు నేర్పించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, అశోక్, ఎన్జీఓ భవన్ అధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ, 33 కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాడిచెర్లపల్లి, లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్, మోహినిపుర, గణేశ్‌నగర్, ముర్షద్‌గడ్డ, ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

యూరియాను మితిమీరి వాడొద్దు

రైతులకు శాస్త్రవేత్త సుధాకర్

వర్గల్(గజ్వేల్): యూరియాను మితిమీరి వాడితే భూసారం దెబ్బతింటుందని, రసాయనిక మందులు అవసరం మేరకే వాడుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ సూచించారు. మండలంలోని మైలారంలో ఏఓ శేషశయన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఇష్టానుసారంగా యూరియా వాడితే పైరుకు ప్రయోజనం చేకూరదని, రసాయన క్రిమిసంహారకాలు అధికారుల సిఫారసు మేరకే వాడాలని చెప్పారు. సాగునీరు ఆదా చేయాలని, పంటమార్పిడి చేస్తే ఎన్నో ప్రయోజనాలున్నాయని సూచించారు. ఏఈఓలు సంతోష్, తేజస్వి, సునీత, భారతి, రైతులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): రైతులతో శాస్త్రవేత్త సుధాకర్, ఏఓ శేషశయన తదితరులు

ఆయిల్‌పామ్‌పై అవగాహన

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక రైతువేదికలో ఏఓ రామకృష్ణ ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించారు. ఈ యేడాదిలో 150 ఎకరాలలో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయనున్నట్లు చెప్పారు. కొత్తగా సాగుచేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ, అదే ఎస్సీ, ఎస్టీ రైతులకైతే 100 శాతం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. ఏఈఓలు రాజు, అనూష పాల్గొన్నారు.

వానాకాలం పంటలపై..

దుబ్బాక: మండలంలోని హబ్సిపూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. టి.శ్రీజయ, ఉమారాణి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో రైతులు తమ పంటలకు రసాయన ఎరువులను అవసరాన్ని బట్టి మాత్రమే వినియోగించాలన్నారు. ఆయిల్‌ఫెడ్ జిల్లా ఏరియా ఆఫీసర్ శంకర్ మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తూ అధిక లాభాలు పొందవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, సన్నీ, ప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈలో 'నవోదయం'

టెన్త్, ట్వెల్త్‌లో శతశాతం ఉత్తీర్ణత



శ్రీవర్షిణి (టెన్త్ టాపర్)



శ్రీఅవేజ్ఞ (ట్వెల్త్ టాపర్)

వర్గల్(గజ్వేల్): సీబీఎస్‌ఈ బోర్డు మంగళవారం విడుదల చేసిన టెన్త్, ట్వెల్త్ ఫలితాల్లో వర్గల్ నవోదయ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రిన్సిపాల్ రాజేందర్ ఫలితాల వివరాలను వెల్లడించారు. పదోతరగతిలో ఎం.శ్రీవర్షిణి, ట్వెల్త్‌లో యాదోజు శ్రీఅవేజ్ఞ టాపర్లుగా నిలిచారు. 2024–25 విద్యా సంవత్సరం టెన్త్, ట్వెల్త్ చదువుతున్న నవోదయ విద్యార్థులకు ఫిబ్రవరి, మార్చి నెలలో సీబీఎస్‌ఈ బోర్డు వార్షిక పరీక్షలు జరిగాయి. టెన్త్‌లో ఎం.శ్రీవర్షిణి 97 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. బి.ఐశ్వర్య 94.6 శాతం మార్కులతో ద్వితీయ, బి.వినీత, కె.స్రవంతి, ప్రవీణ్‌కుమార్ 94.4 శాతం మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ట్వెల్త్‌లో యాదోజు శ్రీఅవేజ్ఞ 95.2 శాతం మార్కులతో ప్రథమ, బి.సాహితి 91.4 శాతం మార్కులతో ద్వితీయ, ఆర్.శ్రీమిధుల 90.8 శాతం మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

'భూభారతి'తో శాశ్వత పరిష్కారం

- సదస్సులు సద్వినియోగం చేసుకోండి
- తహసీల్దార్ అనంతరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని, అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనంతరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చాపగానీతండాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 37 గ్రామాలు ఉండగా అందులో 14 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలోను సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 18 గ్రామాల్లో పూర్తి చేశామని చెప్పారు. రైతుల నుంచి 1,575 దరఖాస్తులను స్వీకరించామని, 20లోగా అన్ని గ్రామాల్లో సదస్సులు పూర్తిచేస్తామని చెప్పారు. గ్రామాల్లో చాలా వరకు సాదాబైనామా, అసైన్డ్ భూముల సమస్యలపైనే రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారని అధికారులు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్ట్‌తోనైనా భూ సమస్యలు పరిష్కరించాలని రైతన్నలు ఎదురు చూస్తున్నారు.



అంతక్కపేటలో రెవెన్యూ సదస్సు

ఘనంగా రథోత్సవం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం రంగనాయక స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళహారతులతో గ్రామంలో రథోత్సవం కొనసాగింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

దిశ కమిటీ సభ్యురాలిగా వనజ



వనజ

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా దిశ కమిటీ సభ్యురాలుగా మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన తిప్పని వనజ నియామకమయ్యారు. జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం లక్ష్యంగా రూపొందించిన దిశ కమిటీ పని చేస్తుంది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానన్నారు. తనను నామినేట్ చేసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.9 వేలు జరిమానా, ఒక్కరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలా మారిందని మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ రాంచంద్రం యాదవ్ తెలిపారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన నరిగె సంధ్యారాణికి మంజూరైన రూ.30 వేలు సహాయనిధి చెక్కును మంగళవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్, బాలస్వామి పాల్గొన్నారు.

బడిబాటపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి బలోపేతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు బడిబాట, ఉల్లాస్ కార్యక్రమాలపై ఏంఈఓ రమేశ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, ఇతర వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. 2026–2027 విద్యా సంవత్సరానికి గాను గ్రామాలలో 15యేళ్లు నిండిన నిరక్షరాసులను గుర్తించి వారిని ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఎస్‌హెచ్‌జీ మహిళతో వారికి విద్యను అందించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అపరిచితుల మాటలు నమ్మొద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్)/చిన్నకోడూరు(సిద్దిపేట): అక్కన్నపేట మండలంలోని అంతక్కపేట గ్రామంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై ఏఎస్‌ఐ రామ్మూర్తి మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాట్సప్‌కు వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయవొద్దని సూచించారు. ఏదైనా ఘటన జరిగితే మహిళలు మౌనం వీడి పోలీసులకు తెలియపర్చాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దకోడూరులో ప్రొహిబిషన్ ఎస్‌ఐ ఆసిఫ్ అలీ మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రతకు ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



అంతక్కపేటలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ రామ్మూర్తి

బాధిత కుటుంబాలకు సాయం



దుబ్బాకరూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: మండలంలోని పోతారెడ్డిపేటలో కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఇద్దరు ఉపాధి హామీ మహిళ కూలీల మృతదేహాల వద్ద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ఓదార్చారు. బ్యాగరి చంద్రవ్వ, గోప దేవవ్వ మృతదేహాలపై పూలమాలలు వేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, బీఆర్‌ఎస్ నాయకులు రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధికి కృషిచేస్తా..

తనపై నమ్మకంతో 50 వేల పైగా ఓట్ల మెజార్టీతో గెలిపించిన దుబ్బాక నియోజకవర్గం ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరధిలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మల్లన్నసాగర్ పంట కాలువల నిర్మాణం పూర్తిచేయించడమే తన లక్ష్యం అన్నారు. ఆయన వెంట నాయకులు భూంరెడ్డి, రామస్వామిగౌడ్, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

దౌల్తాబాద్(దుబ్బాక): అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉప్పరిపల్లిలో ఎల్లమ్మ సిద్ధియోగ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. గౌడ కులస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. నాయకులు రహీమొద్దీన్, చిత్తారి గౌడ్, నాగరాజు గౌడ్, రాజలింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణపై వివరణ ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతుండగా అకస్మాత్తుగా కాల్పుల విరమించడంపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్‌పై యుద్ధంలో గెలుస్తున్న సమయంలో ఎందుకు వెనక్కి తగ్గారని మండిపడ్డారు. దేశం మొత్తం సైనికుల వైపు ఉంటే మోదీ మాత్రం ట్రంప్ వైపు ఉన్నారని ఆరోపించారు. మన దేశ భద్రతపై ట్రంప్ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ట్రంప్ మధ్యవర్తిత్వం వహించడం అంటే ఉగ్రవాదానికి వత్తాసు పలకడమే అన్నారు. కర్రిగుట్టలో కూడా కూంబింగ్ ఆపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజొద్దీన్, హర్షద్, నజ్జు, బబ్బు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట వెడల్పు పెంచాలని వినతి

హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్న సందర్భంగా కట్ట వెడల్పు పెంచాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు మాట్లాడుతూ ప్రతియేటా ఎల్లమ్మ చెరువుకట్టపై బతుకమ్మ వేడుకలు జరుపుకుంటారని, వాటర్ ఫౌంటైన్, పైలాన్, పిల్లర్ల నిర్మాణంతో కట్ట ఇరుకుగా మారిందని వాపోయారు. బతుకమ్మ విగ్రహం నుంచి కట్ట చివరి వరకు వెడల్పు పెంచితే బతుకమ్మ ఆడేందుకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, అనంత స్వామి, వెంకటేశ్, రాంప్రసాద్, నాగార్జున్ తదితరులు ఉన్నారు.